సాక్షి ఖమ్మం

బుధవారం । 28 । ఆగస్టు । 2024



వెలుగుమట్ల గుట్టపై ఘర్షణ

భూదాన్ భూముల పేరిట పట్టాభూముల్లో గుడిసెలు వేశారంటూ తొలగించే క్రమంలో పరస్పర ఘర్షణతో ఉద్రిక్తత నెలకొంది. 8లో



ఏ వాతావరణమైనా సరే..!

ఏ వాతావరణంలోనైనా సరే సాగుకు వీలున్న చిరుధాన్యాలపై రైతులు ఆసక్తి కనబరిస్తే లాభాల పంట పండనుంది. 8లో



వాతావరణం

జిల్లాలో బుధవారం ఉదయం నుంచే ఎండ మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆస్పత్రుల్లో మందుల కొరత రానివ్వం



వైద్యులతో సమీక్షిస్తున్న డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్

నేలకొండపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స అన్నిరకాల మందులను సమకూరుస్తూ కొరత రాకుండా చూస్తున్నామని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్‌ఎస్) డాక్టర్ కె.రాజశేఖర్ వెల్లడించారు. నేలకొండపల్లిలోని సామాజిక వైద్యశాలను మంగళవారం తనిఖీ చేసిన ఆయన చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన వైద్యులతో సమావేశం కాగా ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పడంతో త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు. అనంతరం డీసీహెచ్‌ఎస్ మాట్లాడుతూ చికిత్స కోసం వచ్చే వారికి ఇబ్బంది ఎదురుకాకుండా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంగ్ల, వైద్యాధికారులు కె.రాజేష్, శ్రావణ్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.


ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన



బోనకల్ మండలం లక్ష్మీపురంలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

మధిర/బోనకల్/ఎర్రుపాలెం: ప్రతీ నియోజకవర్గంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పాఠశాల ఏర్పాటుచేయాలని నిర్ణయించిన ప్రభుత్వం తొలిదశలో కొడంగల్, మధిర నియోజకవర్గాలను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు మధిరలో స్థలాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపాన సర్వే నంబర్ 53లో సుమారు ఐదెకరాల స్థలాన్ని గతంలోనే గుర్తించారు. ఈమేరకు స్థలాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించగా నివేదికను తహసీల్దార్ రాంబాబు అందజేశారు. అలాగే, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు కోసం బోనకల్ మండలం లక్ష్మీపురం, ఎర్రుపాలెం మండల కేంద్రాల్లో కూడా స్థలాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ డీఈ శంకర్‌రావు, తహసీల్దార్లు పున్నం చందర్, ఉషాశారద, ఉద్యోగులు కృష్ణ, లక్ష్మణ్, రవికుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే లక్ష్యసాధన



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ శర్మ

ముదిగొండ: విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకుని చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే లక్ష్యసాధన సులువవుతుందని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ముదిగొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో గత రెండు బ్యాచ్‌ల్లో ఎస్సెస్సీలో ప్రతిభ చూపిన ఆరుగురు విద్యార్థులకు పద్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.70వేలు నగదు పురస్కారాలతో పాటు నూతన దుస్తులు, పతకాలు, జ్ఞాపికలను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా ఎదురయ్యే అడ్డంకులను సంస్కారం, మంచి గుణంతో అధిగమించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు కంభంపాటి శాంతి, వెంకట్రామిరెడ్డి, పద్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెరుకూరి జనార్దన్‌రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం పోస్టాఫీస్‌లో పీఎంజీ తనిఖీ

ఖమ్మంగాంధీచౌక్: హైదరాబాద్ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్(పీఎంజీ) సుమిత్ర అయోధ్య ఖమ్మం డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పీఎంజీతో పాటు అధికారుల బృందం రికార్డులు, తపాలా పథకాల నిర్వహణను పరిశీలించింది. ఈమేరకు పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. అలాగే, ఇటీవల కూల్చివేసిన హెడ్ పోస్టాఫీస్ భవన స్థలంలో ఆర్‌ఎంఎస్ పార్సిల్ విభాగానికి కార్యాలయం నిర్మించే యోచనలో ఉండగా స్థలాన్ని పరిశీలించిన పీఎంజీ.. వివరాలు ఆరా తీశారని సమాచారం. ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి, హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్ సుబ్రమణ్యం ఉన్నారు.

లిఫ్ట్.. ఇచ్చారు!

జిల్లాలో ఎత్తిపోతల పథకాలకు జవసత్వాలు రానున్నాయి. మరమ్మతులకు గురై మొరాయిస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల్లో కొన్నింటికి నీటిపారుదల శాఖ ఓఅండ్ఎం కమిటీ నిధులు మంజూరు చేసింది. ఇటీవల అధికారులు పంపించిన ప్రతిపాదనలను ఈనెల 8న పరిశీలించిన కమిటీ రూ.1,79,70,000 మంజూరు చేసింది. అలాగే, ఖమ్మం రూరల్ మండలంలో మున్నేరు నదిపై తీర్థాల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు రూ.3.27 కోట్లతో, ఇదే నదిపై ఖమ్మం రూరల్ మండలం పొలిశెట్టిగూడెం వద్ద ఎత్తిపోతల పథకం పునర్నిర్మాణానికి రూ.3.50 కోట్లతో ప్రతిపాదించగా ప్రభుత్వానికి పంపాలని కమిటీ సూచించింది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

- ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు రూ.1.79 కోట్లు
- ఇంకొన్నింటి ప్రతిపాదనలు పంపించాలన్న ఓఅండ్ఎం కమిటీ
- తీర్థాల, పొలిశెట్టిగూడెం వివరాలు సిద్ధం చేస్తున్న అధికారులు
- ఆమోదం లభిస్తే మరో రూ.6.77 కోట్ల నిధులు



పెనుబల్లి మండలంలోని రాతోని ఎత్తిపోతల పథకం

మళ్లీ ప్రతిపాదనలు

కొణిజర్ల మండలం కొండవనమాల జీపీ పరిధి సీతారాంపురం వద్ద ఊరచెరువు తూము పనిచేయడం లేదు. అలాగే అలుగులకు రాళ్లు పోయాల్సి ఉండగా నీటిపారుదల శాఖ అధికారులు రూ.34.63 లక్షలకు అంచనాలు సమర్పించారు. అయితే, పరిశీలించిన కమిటీ నిధుల విషయమై అభ్యంతరం చెబుతూ మరోమారు అంచనాలను పంపాలని సూచించింది. ఇక అత్యధిక నిధులు అవసరమైన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లకు సంబంధించి తుది నిర్ణయం కోసం ప్రభుత్వానికి నివేదించాలని తెలిపింది. ఖమ్మం రూరల్ మండలం పొలిశెట్టిగూడెం వద్ద మున్నేరు నది కుడి కాల్వపై లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పునర్నిర్మాణానికి రూ.3.50 కోట్లు, ఇదే మండలం మున్నేరు కుడి కాల్వపై ఉన్న తీర్థాల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మరమ్మతులకు రూ.3.27 కోట్లు అవసరమని ప్రతిపాదించగా ప్రభుత్వానికి పంపించాలని సూచించింది.

ఇవి కూడా అంతే...

కొన్ని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లకు సంబంధించి పనులపై ప్రతిపాదనలను సైతం ప్రభుత్వానికి పంపాలని కమిటీ సూచించింది. నేలకొండపల్లి మండలంలో పాలేరు నది ఎడమ కాల్వపై రామచంద్రాపురం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పునర్నిర్మాణానికి రూ.55 లక్షలు, ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్ల వద్ద మున్నేరు కుడి కాల్వపై గుదిమళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పునరుజ్జీవానికి రూ.39.60 లక్షలు, తిరుమలాయపాలెం మండలం అజ్మీర్‌తండా వద్ద ఆకేరుపై 1, 2 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల పునరుద్ధరణకు రూ.45 లక్షలు, నేలకొండపల్లి మండలం సుర్దేపల్లిలో పాలేరు నది ఎడమకాల్వపై ఎస్సీ కార్పొరేషన్ నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మరమ్మతులకు రూ.51.20 లక్షలు అవసరమని జిల్లా అధికారులు ప్రతిపాదించారు. అయితే, వీటన్నింటినీ ప్రభుత్వానికి నివేదించాలని కమిటీ పేర్కొంది.

జీఓ 45 ప్రకారమే పనులు

ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లిలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పునరుజ్జీవం కోసం రూ.23.50 లక్షలతో ప్రతిపాదించగా సలహాదారు నుంచి సూచనలు తీసుకుని జీఓ నంబర్ 45 ప్రకారం పనులు చేపట్టాలని సీఈకి కమిటీ సూచించింది. అలాగే నేలకొండపల్లి మండలం రామచంద్రాపురంలో పాలేరు నది ఎడమ కాల్వపై నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మరమ్మతులకు రూ.2.60 లక్షలతో, నాచేపల్లిలోని శంకరగిరి వాగు ఎడమకాల్వపై లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్–2 మరమ్మతులకు రూ.4.10 లక్షల నిధులు వసరమని అధికారులు ప్రతిపాదనలు సమర్పించారు. ఇక్కడే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్–1కు రూ.4.70 లక్షల నిధులు అవసరమని పేర్కొనగా జీఓ నంబర్ 45 ప్రకారం పనులు చేపట్టాలని కమిటీ బాధ్యులు స్పష్టం చేశారు.

ఏయే పథకాలకు....

- పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించి కూసుమంచి మండలం జుజ్జులరావుపేటలో లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ 140.10 కి.మీ. వద్ద ఔట్‌ఫాల్ రెగ్యులేటరీ మరమ్మతులు, ఇతర పనులకు రూ.50.10 లక్షలు
- ముదిగొండ మండలం ఎడవల్లి సమీపాన ఎడమ బ్రాంచ్ కెనాల్ 165.175 కి.మీ. వద్ద క్రాస్ రెగ్యులేటరీ మరమ్మతులకు రూ.64.90 లక్షలు
- కల్లూరు మండలం బత్తులపల్లిలో సాగర్ లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్‌పై లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో 21వ ఎంబీసీ 73.120 కి.మీ. వద్ద 400 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్, ఈఅండ్ఎం పనులకు రూ.13.10 లక్షలు
- పెనుబల్లి మండలం గౌరారం వద్ద సాగర్ లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్‌పై రాతోని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు 79.795 కి.మీ. వద్ద 250 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ యార్డ్, 500 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రూ.13.40 లక్షలు
- పెనుబల్లి మండలం తాళ్లపెంటలో సాగర్ లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ 76 కి.మీ. వద్ద తాళ్లపెంట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు రూ.22.60 లక్షలు
- కల్లూరు మండలం నారాయణపురంలో సాగర్ లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ 73.093 కి.మీ. వద్ద నారాయణపురం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ 250 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు రూ.5.20 లక్షలు
- కల్లూరు మండలం కప్పలబంధంలో సాగర్ లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్‌పై నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో 69.760 కి.మీ. వద్ద 750 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్, అత్యవసర పనులకు 10.40 లక్షలు మంజూరయ్యాయి.

ప్రభుత్వ భూముల పరిరక్షణ తప్పనిసరి

- భవిష్యత్ అభివృద్ధికి ఈ స్థలాలే కీలకం
- అక్రమ మైనింగ్, ఆక్రమణలపై నివేదిక ఇవ్వండి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రి తుమ్మలకు వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రభుత్వ స్థలాల పరిరక్షణను అధికారులు బాధ్యతగా భావించి పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో ఖమ్మం నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీతో పాటు భవిష్యత్‌లో అభివృద్ధి పనులకు ప్రభుత్వ స్థలాలు అవసరమైనందున ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి ఫెన్సింగ్ వేయాలని సూచించారు.

అక్రమ మైనింగ్‌పై దృష్టి పెట్టండి.

రఘునాథపాలెం మండలంలో అక్రమ మైనింగ్ కార్యకలాపాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మైనింగ్, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అడ్డుకట్ట వేయాలన్నారు. ఖమ్మం అర్బన్ మండలం గోళ్లపాడు చానల్ పై ఆక్రమణలు తొలగించడమే కాక జీఓ 58, 59ల్లో న్యాయబద్ధంగా లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే, తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి స్థలాలను స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ వేయాలని సూచించారు. ఇంకా రోడ్ల విస్తరణ, ఎన్నెస్పీ భూముల్లోస్థలాల పంపిణీ, ఆక్రమణలు, చెరువులు, కాల్వ భూముల పరిరక్షణ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, డంపింగ్ యార్డ్ నిర్వహణపై సూచనలు చేశారు. అంతేకాక రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటేటప్పుడు భవిష్యత్‌లో జరిగే విస్తరణ, విద్యుత్ లైన్లను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి తెలిపారు. అలాగే, డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను అధికారులు పరిశీలించి స్థితిగతులపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి, లబ్ధిదారులకు అందజేయడానికి అవసరమైన నిధుల వివరాలు అందులో పొందుపర్చాలని తెలిపారు. ఈ సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడగా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీఆర్‌ఓ ఎం.రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీఓ జి.గణేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ హేమలత, పీఆర్, గిరిజన సంక్షేమ శాఖ, ఇరిగేషన్, హౌసింగ్ ఈఈలు వెంకట్‌రెడ్డి, తానాజీ, అనన్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్ట్‌లో మరో సొరంగం

- ప్యాకేజీ – 8లో నిర్మాణానికి ప్రతిపాదనలు
- ప్యాకేజీ – 13లో వ్యయం తగ్గేలా అలైన్‌మెంట్

ఖమ్మంఅర్బన్: ఉమ్మడి జిల్లా పరిధిలో సాగు భూములకు గోదావరి జలాలను అందించేందుకు ప్రతిపాదించిన సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే కూసుమంచి మండలంలో నీటి తరలింపునకు సొరంగ మార్గం నిర్మిస్తుండగా పనులు పురోగతిలో ఉన్నాయి. మరోచోట కూడా ఇదే తరహా నిర్మాణానికి అధికారులు ప్రతిపాదించారు. ప్రాజెక్టు ప్యాకేజీ – 8లో జలవనరుల శాఖ కొత్తగూడెం డివిజన్ పరిధి జూలూరుపాడు మండలం వినోబానగర్ సమీపాన ఈ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం అధికారులు సమర్పించిన ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదలుపెడతారని సమాచారం.

రూ.620 కోట్లు కాదు రూ.350కోట్లే...

ప్రాజెక్టులో మరో కీలకమైన మార్పు చోటు చేసుకోనుంది. ప్యాకేజీ – 13లో నిర్మాణాలకు గత ప్రభుత్వ హయాంలో రూ.620కోట్లు కేటాయించి టెండర్లు పిలిచారు. అయితే, వివిధ కారణాలతో టెండర్ల దశ దాటలేదు. ఇంతలోనే ప్రభుత్వం మారడంతో ఈ ప్యాకేజీ పనుల ప్రతిపాదనలను పరిశీలిస్తే చాలాచోట్ల భారీ స్థాయిలో కట్టడాలు అవసరమని గుర్తించారు. అందుకోసమే రూ.620 కోట్లు వ్యయమవుతుందని భావించగా రీ డిజైన్ చేయించారు. కొత్త ప్రతిపాదనల ఆధారంగా ఇదే ప్యాకేజీలో పనులు పూర్తిచేయడానికి రూ.350 కోట్లు సరిపోతాయని అంచనాకు వచ్చారు. అంతేకాక భూమి కూడా తక్కువగా అవసరమవుతుందనే భావన వ్యక్తమైంది. ఈ నేపథ్యాన అటవీ శాఖ నుంచి సేకరించే భూమి మరో చోట కేటాయించడమేకాక నూతన అలైన్‌మెంట్ సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇదంతా వారం, పది రోజుల్లో పూర్తిచేసి టెండర్లు పిలిచే అవకాశముందని సమాచారం.

నేటి నుంచి కుటుంబ సభ్యుల నిర్ధారణ

- రైతు రుణమాఫీ ఫిర్యాదులపై రంగంలోకి అధికారులు
- రైతుల కుటుంబీకులతో ఏఓ సెల్ఫీ.. ఆపై అప్‌లోడ్



ఖమ్మంవ్యవసాయం: రుణమాఫీ వర్తించని రైతు కుటుంబాలను నిర్ధారించే ప్రక్రియ బుధవారం నుంచి చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వం రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేసినా పెద్దసంఖ్యలో రైతులు అర్హత ఉన్నా వర్తించలేదని ఫిర్యాదు చేస్తున్నారు. అయితే కుటుంబం, రేషన్ కార్డును ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకోగా కార్డులు లేని వారు మాఫీకి దూరమయ్యారు. ఇంతలోనే రేషన్ కార్డులు లేని వారికి సైతం అర్హతల ఆధారంగా రుణమాఫీ వర్తింపచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, డైరెక్టర్ డాక్టర్ గోపి, అడిషనల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ మంగళవారం జిల్లాల అధికారులకు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. రేషన్ కార్డులు లేక రుణమాఫీ పొందని రైతుల వివరాలతో కూడిన జాబితా ఇప్పటికే జిల్లా అధికారులకు అందడంతో కుటుంబ సభ్యుల నిర్ధారణకు సిద్ధమవుతున్నారు.

అందరూ రావాల్సిందే...

జాబితా ఆధారంగా రుణమాఫీ అందని రైతుల కుటుంబ సభ్యులను నమోదు చేయాల్సి ఉంటుంది. కుటుంబంలోని సభ్యులంతా పాల్గొనడమే కాక అందరి ఆధార్ కార్డులు, ఇతర ధ్రువపత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకం వెంట తీసుకురావాలి. ఆ వివరాలను పరిశీలించి కుటుంబంతో ఏఓ సెల్ఫీ దిగి 'రైతు భరోసా పంట రుణమాఫీ' పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. అయితే, రూ.2 లక్షల లోపు రుణాలు కలిగిన రైతు కుటుంబాల వివరాలను మాత్రమే ఇప్పుడు నమోదు చేయనుండగా, అంతకు మించి రుణాల విషయమై ప్రభుత్వం నుంచి విధివిధానాలు వెల్లడి కాలేదు. కాగా, ఒక్కో ఏఓ రోజుకు 100 కుటుంబాలను నిర్ధారించి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులు ఆదేశించారు. జిల్లాలో సుమారు 50 వేల కుటుంబాలకు బుధవారం నుంచి నిర్ధారణ ప్రక్రియ మొదలుకానుంది.

రుణమాఫీకి కటాఫ్ డేట్ ప్రకటించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో బాగం, పోతినేని
- మంత్రి కాన్వాయ్ అడ్డగింత.. అర్హులందరికీ అమలుచేస్తామన్న తుమ్మల



ఆందోళనకు దిగిన వారితో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: రుణమాఫీ అమలులో జాప్యాన్ని అరికట్టి కటాఫ్ డేట్ ప్రకటిస్తూ పూర్తిస్థాయిలో రూ.2 లక్షల మేర రుణమాఫీ చేయాలని సీపీఐ, సీపీఎం అనుబంధ రైతు సంఘాల రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. ఈక్రమంలో ఆంక్షలన్నీ సడలించాలని పేర్కొన్నారు. ఈమేరకు రైతులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ వద్ద వేర్వేరుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంతరావు, సుదర్శన్‌రావు మాట్లాడుతూ రుణ మాఫీకి రకరకాల కొర్రీలు పెట్టడంతో రైతుల్లో ఆందోళన నెలకొందని తెలిపారు. రుణమాఫీ ప్రక్రియను స్వాగతిస్తూనే సత్వరమే అర్హులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సరైన సమాచారం లేక రైతులు అటు అధికారులు, ఇటు బ్యాంకుల చుట్టూ సాగు పనులను వదిలిపెట్టి తిరగాల్సి వస్తోందని వాపోయారు. ఆతర్వాత కలెక్టర్ ముజ మ్మిల్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘాలు, పార్టీలు, అనుబంధ సంఘాల నాయకులు కొండపర్తి గోవిందరావు, రాంబాబు, పోటు ప్రసాద్, నున్నా నాగేశ్వరరావు, మహ్మద్ మౌలానా, దొండపాటి రమేష్, జమ్ముల జితేదంర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్.కే.జానిమియా, ఏపూరి లతాదేవి, సిద్ధినేని కర్ణకుమార్, సింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, మాదినేని రమేష్, పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చివరి ఖాతాకూ రుణమాఫీ

రాష్ట్రంలో 41,78,892 మంది రైతులు 40 బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోగా.. వీటిని మాఫీ చేసేందుకు ప్రభుత్వం రూ.31 వేల కోట్లను కేటాయించినందున చివరి ఖాతాకు సైతం మాఫీ జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించి బయటకు వస్తున్న మంత్రి కాన్వాయ్‌ను నాయకులు, రైతులు అడ్డుకోగా ఆయన వాహనం దిగి మాట్లాడారు. ఇప్పటి వరకు రూ.12వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని.. మిగతా ప్రక్రియ కూడా పూర్తి చేస్తామన్నారు. కుటుంబ నిర్ధారణ జరగకపోవడంతో రుణమాఫీ ఆలస్యమవుతోందే తప్ప ప్రభుత్వ పరంగా ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. రేషన్‌కార్డులు, పాస్‌పుస్తకాలు లేకపోయినా మాఫీ జరుగుతుందని అన్నారు. అయితే, రూ.2 లక్షలకు పైబడి రుణం ఉంటే మాత్రం ఎక్కువగా ఉన్న మొత్తాన్ని చెల్లిస్తేసే ప్రభుత్వం తరఫున రూ.2 లక్షలు జమ చేస్తామని తుమ్మల స్పష్టం చేశారు.

జాతీయ స్థాయిలో మన సార్!





తిరుమలాయపాలెం జెడ్పీహెచ్‌ఎస్ జీవశాస్త్రం ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. జాబితాలో తెలంగాణ నుంచి ఇద్దరే ఉండగా ప్రభాకర్‌రెడ్డికి స్థానం దక్కడం విశేషం. కాగా, ఉపాధ్యాయుడిని అభినందించిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గం పాఠశాల ఉపాధ్యాయుడు జాతీయ స్థాయికి ఎంపికవడం గర్వకారణమని తెలిపారు. – తిరుమలాయపాలెం

- వివరాలు మెయిన్‌లో

వారబందీ విధానంలో సాగర్ నీరు

జిల్లాలో రెండు భాగాలుగా ఆయకట్టు

ఖమ్మం అర్బన్: జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు ఈ సీజన్‌లో సాగు నీరు అందించడానికి వారబందీ విధానం అమలుచేయాలని జలవనరుల శాఖ అధికారులు నిర్ణయించారు. జిల్లాలోని 17 మండలాల పరిధి 2.54 లక్షల ఎకరాల ఆయకట్టులో వరి, ఆరుతడి పంటలకు సాగునీరు అందించాల్సి ఉంది. దీంతో ఆయకట్టును రెండు భాగాలుగా విభజించారు. పాలేరు రిజర్వాయర్ నుండి బోనకల్లు బ్రాంచ్ కాల్వ పరిధి వరకు ఒక భాగం, అక్కడి నుంచి దిగువ ఆయకట్టును ఇంకో భాగంగా విభజించి ఏడు రోజులు ఆన్, మరో ఏడు రోజులు ఆఫ్ విధానంలో పంట కాలం పూర్తయ్యే డిసెంబర్ మొదటి వారం వరకు ఏడు తడుల్లో నీరు అందించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే ఆయకట్టుకు నీరు అందించనున్నారని సమాచారం. వారంలోగా ఈ ప్రక్రియ మొదలవుతుందని తెలిసింది. కాగా, సాగర్ డ్యాంకు పెద్ద ఎత్తున వరద వచ్చి పాలేరు రిజర్వాయర్‌కు నీరు విడుదల చేసినా ఆయకట్టుకు మళ్లించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, సాగర్ ఎడమ కాల్వ అక్కడక్కడా సక్రమంగా లేనందున పూర్తి స్థాయిలో నీరు రావడం లేదని, ఫలితంగా ఆయకట్టుకు అందడంలేదని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

1న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టు ఎంపిక

కల్లూరు: ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్టు ఎంపికకు వచ్చేనెల 1న కల్లూరులోని మినీ స్టేడియంలో పోటీలు నిర్వహించనున్నట్లు పీఈటీ పి.వీరరాఘవయ్య తెలిపారు. 2010 అక్టోబర్ 3వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇక్కడ ప్రతిభ చాటే వారితో రాష్ట్ర స్థాయి పోటీలకు జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో 1వ తేదీన ఉదయం 9గంటకల్లా రిపోర్ట్ చేయాలని సూచించారు.

సివిల్స్ అభ్యర్థికి రూ.లక్ష 'అభయహస్తం'



సీఎం చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న గోపి

నేలకొండపల్లి: సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు సింగరేణి సౌజన్యంతో రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం కింద రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మండలంలోని మంగాపురం తండాకు చెందిన భూక్యా గోపి అందుకున్నాడు. నేటికీ గోపి కుటుంబం పూరి గుడిసెలో నివసిస్తుండగా, ఆయన తండ్రి వెంకటేశ్వర్లు హమాలీ పని చేస్తూ కుమారుడిని చదివిస్తున్నాడు. ఈక్రమాన మెయిన్స్ అర్హత సాధించి సీఎం చేతుల మీదుగా ఆర్థిక సాయం అందుకోవడంపై పలువురు అభినందించారు. మాజీ సర్పంచ్ భూక్యా సుధాకర్, గోపి తండ్రి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శిక్షణకు జిల్లా అధికారులు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉన్నతికి ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(ఎల్ఐపీ) కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో బుధవారం శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ శిక్షణలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్, డీసీఈబీ సెక్రటరీ నారాయణతో పాటు 21 మంది మండల నోడల్ అధికారులు పాల్గొననున్నారు.

బ్రహ్మంగారి గుడి నిర్మాణానికి ముస్లిం విరాళం



రూ.10వేల విరాళం అందజేస్తున్న గౌసుద్దీన్

కారేపల్లి: కారేపల్లిలో నిర్మిస్తున్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి జామే మసీదు కమిటీ మాజీ అధ్యక్షుడు షేక్ గౌసుద్దీన్ మంగళవారం రూ.10వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గౌసుద్దీన్ మాట్లాడుతూ మతాలకతీతంగా పరస్పరం గౌరవించుకోవడం సంప్రదాయమని, అందరూ సమష్టిగా సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని సూచించారు. ఈ మేరకు ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు తుమ్మోజు రామ్మూర్తి, కోటాచారి, అనంతారపు వెంకటాచారి, అద్దంకి వీరభద్రాచారి, పోలోజు రామాచారి, కల్లూరి రామాచారి, కల్లూరి వీరభద్రాచారి, అప్పారావు తదితరులు ఆయనను సన్మానించారు.

గంజాయి కేసులో సూత్రధారుల అరెస్ట్

ఖమ్మంక్రైం: గంజాయి రవాణా కేసులో సూత్రధారులైన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నగర ఏసీపీ రమణమూర్తి తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపాన అక్రమంగా తరలిస్తున్న 32 కేజీల గంజాయిని ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లోనే ఇద్దరిని అరెస్ట్ చేయగా, కీలక సూత్రధారులైన హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్, జుమేరాత్ బజార్ ప్రాంతానికి చెందిన చిరుమన్వేలి సందుసింగ్ అలియాస్ సంజుసింగ్, చిరుమర్వేలి విష్ణును తాజాగా అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు.

3.90 కేజీల గంజాయి స్వాధీనం

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లి శివారు సాగర్ కాల్వ పక్కన ఇద్దరు వ్యక్తుల నుంచి 3.90 కేజీల ఎండు గంజాయిని మంగళవారం ఖమ్మం రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన నాగేశ్వరరావు గంజాయి తీసుకురాగా ఖమ్మం అర్బన్ మండలం పాండురంగాపురానికి చెందిన మిర్యాల ఎల్లయ్య, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన దేవిశెట్టి వెంకన్న కొనుగోలు చేస్తున్నారు. ఈ సమయాన గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బేకరీలో అగ్నిప్రమాదం

మధిర: వైఎస్సార్ చౌరస్తాలో ఉన్న బేకరీలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. మిడ్ స్టేట్ బేకరీలో గ్యాస్ స్టౌపై తినుబండారాలు సిద్ధం చేస్తుండగా స్టౌ పాతది కావడంతో మంటలు పైపునకు వ్యాపించాయి. దీంతో సుమారు రూ.80వేల విలువైన సామగ్రి, ఆహార పదార్థాలు కాలిపోయాయి. బేకరీ నిర్వాహకులు హనీఫ్‌తో సిబ్బంది మంటలను అదుపు చేస్తుండగా, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు.

ఏ వాతావరణమైనా సరే..!

- చిరుధాన్యాల పంటలతో అధిక దిగుబడి
- నీటిపారుదల.. వర్షాధారంగానూ సాగుకు అనుకూలం
- ఈ నెలాఖరు వరకు విత్తుకునే అవకాశం



డాక్టర్ రుక్మిణీదేవి, మధిర ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త



సజ్జ పంట

మధిర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించాయి. తద్వారా మంచి పోషక విలువలు కలిగిన జొన్న, సజ్జ, రాగి, కొర్ర, సామ, వరిగ, ఊద, అరిక, అండుకొర్రలు వంటి చిరుధాన్యాలను అందరి ఆహారంలో చేర్చడం.. ఆపై భావితరాలకు పౌష్టికాహార లోపం లేకుండా చేయాలనే లక్ష్యంగా నిర్ణయించుకున్నాయి. ఈ క్రమంలో రైతులు కూడా చిరుధాన్యాల సాగుపై అవగాహన పెంచుకుంటే లాభదాయకమైన పంటలు అందుబాటులోకి వస్తాయి. నైరుతి రుతుపవనాల ద్వారా పడే వర్షాలను ఆధారంగా చేసుకుని జూన్ రెండో పక్షం నుంచి ఈ నెలాఖరు వరకు చిరుధాన్యాలను సాగు చేయొచ్చు. కాగా, ఈ పంటలను నీటిపారుదల కిందనే కాక వర్షాధారంగానూ సాగు చేసే ఆకాశముంది. ఆయా పంటలు మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకొని దిగుబడిని ఇవ్వగలిగే శక్తి కలిగి ఉండడం మరో ప్రత్యేకత. అంతేకాక ప్రత్యామ్నాయ పంటలుగానూ ఈ చిరుధాన్యపు పంటలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఈ మేరకు మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ కె.రుక్మిణిదేవితో పాటు శాస్త్రవేత్తలు డాక్టర్ టి.భరత్, కె.నాగస్వాతి ఈ పంటల సాగుపై వెల్లడించిన వివరాలు ఉన్నాయి.

కాలపరిమితి, దిగుబడి

- **జొన్న పంట** : 95–110 రోజుల కాలపరిమితి కలిగి ఎకరానికి 12–14 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సీఎస్‌హెచ్ -14, సీఎస్‌హెచ్- 16, ఎన్‌టీజే-2, ఎన్‌టీజే-4, ఎన్‌టీజే-5 రకాలు అనుకూలం.
- **సజ్జలు** : 75–90 రోజుల పంటకాలం కలిగి ఎకరానికి 8–10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఐసీటీపీ 8203, ఐసీఎంహెచ్-356, హెచ్‌హెచ్‌బీ-121, ఏబీవీ-04 రకాలు అనుకూలం.
- **రాగులు** : ఇది 105–120 రోజుల పంట కాలం కలిగి 12–14 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. వకుళ, శ్రీ చైతన్య, హిమ, తిరుమల, గౌతమి, ఇంద్రావతి రకాలు అనుకూలంగా ఉంటాయి.
- **కొర్రలు** : 68–85 రోజుల పంటకాలం కలిగి 10–12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎస్ఐఏ-3085, సూర్యనంది, గరుడ, మహానాడు అనే రకాలు అనుకూలం.
- **సామలు** : ఈ పంట 75–105 రోజుల కాలపరిమితి కలిగి ఎకరానికి 7–8 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది. బీఎల్-6, ఓఎల్ఎం-217, ఓఎల్ఎం- 4 రకాలు అనుకూలం.
- **అరికలు** : 95–100 రోజుల పంటకాలం కలిగి ఎకరానికి 10–12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. టీఏఎస్‌యూ- 86, జేకే-98, జేకే-65, జేకే-48 రకాలు అనుకూలం.
- **వరిగ పంట** : ఇది 65–75 రోజుల పంటకాలం కలిగి ఎకరానికి 7–8 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది. టీఎన్ఏయూ-202, టీఎన్ఏయూ-143 పీఆర్-18 రకాలు అనుకూలం.
- **అండుకొర్రలు** : ఇది 90–100రోజుల పంటకాలం కలిగి ఎకరానికి 6–8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. జీపీయూబీటీ-6 తదితర రకాలు ఈ పంటల సాగుకు అనుకూలంగా ఉంటాయి.

విత్తడం ఎలా..?

చిరుధాన్యాల సాగులో ఎకరాకు నాలుగు కిలోల విత్తనాలు సరిపోతాయి. ఒక కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజమ్ లేదా 3 గ్రాముల కాప్టాన్ /థైరామ్ కలిపి విత్తనశుద్ధి చేశాక విత్తుకోవాలి. ఇక విత్తనాన్ని వరుసల మధ్య 22.5 సెంటీమీటర్లు మరియు మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు ఎడంగా గొర్రుతో విత్తుకోవాలి. అయితే, జొన్న, సజ్జ, అండు కొర్రలు మాత్రం వరుసల మధ్య 45 సెం.మీ., మొక్కల మధ్య 12–15 సెం.మీ. ఎడంగా విత్తుకోవాలి. కాగా, కలుపు నివారణలో భాగంగా విత్తిన రెండు వారాల్లోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి. విత్తిన 20–25 రోజుల్లోపు దంతితో అంతర కృషి చేసి కలుపు మొక్కలను తీసివేయాలి. అలాగే, కలుపు నివారణకు అట్రాజిన్ 500 గ్రా. లేదా బ్యూటాక్లోర్ 750 మి.లీ.ను ఎకరానికి చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనే 1–2 రోజుల్లోపు తడినేలపై పిచికారీ చేయాలి.

ఎరువుల యాజమాన్యం

అన్ని పంటలకు ఎకరానికి నాలుగు టన్నుల పశువుల ఎరువు ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. జొన్న, సజ్జ పంట వర్షాధారంతో పండించినట్లయితే 24 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం, 12 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులు వేయాలి. నీటిపారుదల పంటకు 32 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులను వేయాలి. రాగి పంటకు ఎకరాకు 24 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు వేయాలి. మిగతా చిరుధాన్యాలైన కొర్ర, సామ, వరిగ, ఊద, అండుకొర్రలకు 8 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్ ఎరువులు వేసుకోవాలి. వర్షాధారంగా చిరుధాన్యాలను సాగు చేసేటప్పుడు, ఎరువులు వేసేటప్పుడు నేలలో తగినంత తేమశాతం ఉండేలా చూసుకోవాలి. నీటిపారుదల కింద సాగు చేస్తున్నప్పుడు ఎరువులు వేసిన వెంటనే పలుచగా నీటి తడులు ఇవ్వాలి.

ఎన్‌ఈపీపై నోరు మెదపని చంద్రబాబు, రేవంత్

ఏపీ శాసనమండలి సభ్యుడు కే.ఎస్.లక్ష్మణ్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు

నేలకొండపల్లి: జాతీయ విద్యావిధానం(ఎన్‌ఈపీ)పై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి నోరు మెదపడం లేదని ఏపీ శాసనమండలి సభ్యుడు కే.ఎస్.లక్ష్మణ్‌రావు అన్నారు. నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం, రామదాసు ధ్యాన మందిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆతర్వాత సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం రాష్ట్రాలతో సంబంధం లేకుండా ప్రకటించిన విధానం విద్య ప్రైవేటీకరణకు బాటలు వేస్తుందన్నారు. అయినా రెండు ప్రభుత్వాల నుంచి ఈ విధానాన్ని వ్యతిరేకిస్తామనే మాట రావడం లేదని చెప్పారు. ఇక 2004 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం(ఓపీఎస్) కొనసాగగా అతర్వాత సీపీఎస్ ప్రవేశపెట్టారని.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొత్తగా యూపీఎస్ అనే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చి ఉపయోగం ఉంటుందని హడావుడి చేస్తోందని వెల్లడించారు. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల కోసమే కేంద్రం యూపీఎస్ విధానాన్ని తీసుకొచ్చినందున ఓపీఎస్‌నే పునరుద్ధరించాలని, తెలుగు రాష్ట్రాల్లో ఉపాధి కల్పనతో పాటు ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలనే డిమాండ్‌తో తాము ఆందోళనలు చేపడుతామని లక్ష్మణ్‌రావు వెల్లడించారు. ఆయన వెంట ఏటుకూరి రామారావు, వల్లూరిపల్లి లక్ష్మీనారాయణ, తొర్తి గురవయ్య, భాగం నరసింహారావు తదితరులు ఉన్నారు.

ప్రణాళికాయుతంగా ఇంగ్లిష్ బోధన

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లిష్ బోధించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన విద్యాశాఖ అధికారులు, ఇంగ్లిష్ ఉపాధ్యాయులతో సమీక్షించారు. ప్రతీ పాఠశాలలో అన్ని తరగతుల విద్యార్థులకు క్రీడా శిక్షణ కోసం అర గంట కేటాయించడమే కాక ఇంగ్లిష్ బోధన ఎంపిక చేసిన తరగతుల వారికి ప్రతిరోజు అర గంట కేటాయించాలని తెలిపారు. అలాగే, నిర్దేశిత సమయాన తరగతి గదుల్లో సంభాషణ పూర్తిగా ఇంగ్లిష్‌లో జరిగేలా పర్యవేక్షిస్తూ విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ఐఎఫ్‌బీ ప్యానళ్ల ద్వారా గేయాలు, చిత్రాలు ప్రదర్శించాలని చెప్పారు. ఇదేసమయాన ఉపాధ్యాయులు సైతం పట్టుసాధించేలా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అంతకాక నియోజకవర్గానికి ఒక పాఠశాలను ఎంపికచేసి ప్రయోగాత్మకంగా ఇంగ్లిష్ ల్యాబ్ ఏర్పాటుచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, ఏఎంఓ జి.రవికుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జగదీష్, రామనాథం, వసంత, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు



పాతర్లపాడులో డ్రెయినేజీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

తిరుమలాయపాలెం: ప్రజలు డెంగీ, ఇతర జ్వరాల బారిన పడకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని డీఎంహెచ్‌ఓ వి.సుబ్బారావు సూచించారు. మండలంలోని అజ్మీరతండా, జల్లెపల్లి, పాతర్లపాడు, తిరుమలాయపాలెంల్లో పర్యటించిన ఆయన జ్వరాలతో బాధపడుతున్న వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అలాగే, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, మురుగునీటి తొలగింపుపై ఎంపీడీఓలు, గ్రామపంచాయతీ ఉద్యోగులతో సమన్వయం చేసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులకు సూచించారు. ఆతర్వాత తిరుమలాయపాలెం పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. డాక్టర్ అలివేలు, ఏఎన్ఎంలు సీత, అనిత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే తాళం పగలగొట్టి చోరీ

కారేపల్లి: పట్టపగలే ఇంటి తాళం పగులగొట్టి ప్రవేశించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. మండలంలోని విశ్వనాథపల్లికి చెందిన రైతు దమ్మాలపాటి రాంబాబు మంగళవారం ఉదయం తన భార్యతో కలిసి చేను వద్దకు వెళ్లాడు. ఈమేరకు మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళంతో పాటు బీరువా తాళాలు పగలకొట్టి ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.28వేల నగదు ఎత్తుకెళ్లారు. చేను నుంచి సాయంత్రం వచ్చాక చోరీ జరిగినట్లు గుర్తించిన రైతులు ఇచ్చిన సమాచారంతో సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై ఎన్.రాజారాం పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

నల్లదుస్తుల్లో వచ్చి చోరీ

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడులోని పలు కూల్‌డ్రింక్ షాపులు, ఓ కిరాణం షాప్‌లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. సోమవారం అర్ధరాత్రి వేళ వచ్చిన వారు ఎవరికీ కనబడొద్దనే భావనతో నల్లదుస్తులు ధరించి ఉండగా.. అలజడికి బయటకు వచ్చిన స్థానికులు గుర్తించి కేకలు వేశారు. ఇంతలోనే నిందితులు కూల్‌డ్రింక్ సీసాలు, బెల్ట్ షాపుల్లోని మద్యం సీసాలు తీసుకుని పరారవుతుండగా వెంబడించడంతో పరుగులు తీస్తూనే నల్లదుస్తులను విప్పేసి కానరాకుండా పోయారు. దీంతో చేసేదేం లేక గ్రామస్తులు వెనుదిరిగారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. కాగా, రాత్రి వేళ ఎవరూ గుర్తించరనే భావనతో నల్లబట్టలతో వారు వచ్చారని తెలుస్తుండగా, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

48గంటల్లోనే నిందితుడి అరెస్ట్, సొత్తు రికవరీ



స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో ఎస్సై, సిబ్బంది

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెంలోని గ్రామపంచాయతీ సమీపాన నివాసముండే జక్కుల భద్రమ్మ ఇంట్లో చోరీ జరగగా 48గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితుడిని గుర్తించి సొత్తు రికవరీ చేశారు. ఇంట్లో భద్రమ్మ లేని విషయాన్ని గుర్తించిన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ములకలపల్లికి చెందిన పాత ఇనుము వ్యాపారం చేసే నెర్సుల నరేష్ ఈనెల 25న(ఆదివారం) మధ్యాహ్నం చోరీ చేశాడు. ఈమేరకు ఫిర్యాదు అందుకున్న ఎస్సై కూచిపూడి జగదీశ్ ఆధ్వర్యాన దర్యాప్తు చేపట్టగా మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలోని శ్రీ సిటీ సమీపాన నరేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడి నుంచి బంగారు దిద్దులు, రెండు జతల పట్టీలను స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- రెండు రోజుల తర్వాత గుర్తించిన స్థానికులు

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్‌కు చెందిన ఎం.బ్రహ్మాచారి(45) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన కొన్నాళ్లుగా మద్యానికి బానిస కావడంతో ఇద్దరు పిల్లలతో సహా భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపానికి గురైన బ్రహ్మాచారి ఈనెల 25న ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకోగా బయటకు విషయం తెలియలేదు. ఇంతలో మంగళవారం ఇంటి నుండి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఆయన మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

పంచాయతీ పంప్ ఆపరేటర్..

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడు జీపీలో పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాచబంటి కోటేశ్వరరావు (44) కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత శనివారం ఆయన భార్యతో ఘర్షణ పడి క్షణికావేశంలో ఇంట్లో ఉన్న కలుపు మందు తాగి పడిపోయాడు. దీంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కోటేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా, ఆయన సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన పాలవ్యాన్

వైరా: లారీని ఓవర్ టేక్ చేసిన ఆటోను ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన వైరా మున్సిపాలిటీ పరిధిలోని వే బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. కొణిజర్ల మండలం పెద్దరాంపురానికి చెందిన పానుగంటి అశోక్ తన ఆటోలో తల్లాడ వైపు నుంచి కొణిజర్ల వస్తూ ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేసే ప్రయత్నం చేశాడు. ఈక్రమంలో వైరా నుంచి తల్లాడ వైపు వెళ్తున్న వైష్ణవి పాల వ్యాన్ ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో ముందు భాగం దెబ్బతినగా డ్రైవర్ అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ చేరుకుని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

ఆన్‌లైన్ గేమ్ పేరుతో రూ.50 వేలు స్వాహా

పెనుబల్లి: మండలంలోని పాతకారాయిగూడెంకు చెందిన నరుకుల్లా అమరేంద్ర తన వాట్సప్ నంబర్‌కు వచ్చిన మెసేజ్‌ను నమ్మి రూ.50 వేలు పోగొట్టుకున్నాడు. ఆన్‌లైన్‌లో గేమ్ ఆడితే విలువైన బహుమతులు వస్తాయని, అందు కోసం తొలుత రూ.50 వేలు డిపాజిట్ చేయాలని మెసేజ్ వచ్చింది. అది నమ్మిన అమరేంద్ర నగదు పంపించి, ఆన్‌లైన్‌లో గేమ్ ఆడటానికి ప్రయత్నించగా ఫలితం కనిపించలేదు. ఆతర్వాత వాట్సప్ ద్వారా కాల్ చేస్తే ఇంకా డబ్బులు చెల్లించాలని సూచించారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన అమరేంద్ర చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఏసీపీ రమణమూర్తి



ఘర్షణలో గాయపడిన మహిళ

వెలుగుమట్ల గుట్టపై ఘర్షణ

- కోర్టు ఆదేశంతో నిర్మాణాల తొలగింపునకు యత్నం
- పట్టాదారులు, ఆక్రమణదారుల నడుమ వివాదం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కలెక్టరేట్‌కు సమీపాన వెలుగుమట్ల గుట్టపై భూవివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో భూదాన్ భూమి ఉందని కొందరు పేదలు గుడిసెలు వేసుకున్నారు. అయితే, పట్టా భూములను సైతం ఆక్రయించారని పలువురు కోర్టును ఆశ్రయించగా గుడిసెలను తొలగించాలని సూచించినట్లు తెలిసింది. దీంతో మంగళవారం గుడిసెలను తొలగించేందుకు జేసీబీలతో వెళ్లగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో గుడిసె వాసులు అడ్డుకున్నారు. అంతేకాక ఇరువర్గాలు రాళ్లు విసురుకోవడం ఓ మహిళ హా పలువురికి గాయాలయ్యాయి. చివరకు పోలీసులు చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. నగర ఏసీపీ రమణమూర్తి, ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్‌తో పాటు వివిధస్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు మధ్య గుడిసెలు తొలగించేందుకు చేసిన యత్నంతో రణరంగంగా మారింది. అయితే, పట్టాదారులు బయటి వ్యక్తులను తీసుకొచ్చి తమపై దాడి చేయించారని గుడిసెవాసులు ఆరోపించారు.



గుడిసెలు తొలగించే క్రమంలో వాదనకు దిగిన ఇరువర్గాలు

ధరణి లీలలు..

పాస్‌పుస్తకంలో పట్టాదారు పేరు మార్పు

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం కాకర్లపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 258, 259/అ లో 2.05 ఎకరాల భూమి మామిళ్లపల్లి రాధమ్మ పేరుతో ఉండగా ఏం జరిగిందో తెలియదు కానీ ధరణి పహాణీలో ఆమె కుమార్తె గారపాటి నారాయణమ్మ పేరిట మారింది. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన రాధమ్మ కుమారుడు తమకు న్యాయం చేయాలంటూ అధికారులను ఆశ్రయించారు. గ్రామానికి చెందిన మామిళ్లపల్లి అప్పయ్య, రాధమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఆరుగురు కుమార్తెలు ఉండగా రాధమ్మకు 2018లో కొత్త పాస్‌పుస్తకం రావడంతో పాటు అప్పటి నుంచే ఏటా రెండు సార్లు రైతుబంధు నగదు జమ అవుతోంది. భూమిని 40 ఏళ్లుగా ఆమె కుమారుడు కేశవరావు సాగు చేస్తుండగా ప్రస్తుతం భూమి, తల్లి పాస్‌పుస్తకం ఆయన ఆధీనంలోనే ఉన్నాయి. అయితే, తొలినాళ్లలో వివాదాల కారణంగా ఆయన తండ్రి 1985లోనే భూమి హక్కులన్నీ కేశవరావుకే చెందుతాయని వీలునామా రాయగా, రాధమ్మ సైతం 2009 నవంబర్‌లో లోక్ అదాలత్ ద్వారా అఫిడవిట్ ఇచ్చింది. ఈ ఏడాది జనవరిలో మామిళ్లపల్లి రాధమ్మ కన్నుమూశారు.

2013లో పాస్‌పుస్తకం లాక్

రాధమ్మ కూతురు దమ్మపేట మండలం మందలపల్లికి చెందిన గారపాటి నారాయణమ్మ తన తల్లి భూమిపై హక్కు తనకు ఉందని కోర్టును ఆశ్రయించగా ఆ కేసు పెండింగ్‌లోనే ఉంది. ఈ విషయాన్ని 2013లో సత్తుపల్లి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా రాధమ్మ పేరిట ఉన్న పాస్‌పుస్తకాన్ని లాక్ చేశారు. ఫలితంగా ధరణి వెబ్‌సైట్‌లో పరిశీలించినా రాధమ్మ పేరే కనిపించేది. కానీ ఈ ఏడాది జూలై 26న గారపాటి నారాయణమ్మ కుమారుడు ప్రసాద్ తన తల్లి పేరిట ఉన్న 2.05 ఎకరాల భూమిని తన పేరుపైకి మార్చాలని ధరణి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, ఇన్నాళ్లు భూమి రాధమ్మ పేరిటే ఉందని భావిస్తున్న కేశవరావు కుటుంబీకులకు ఈ విషయం తెలిసి పరిశీలించగా అవాక్కయ్యారు. కోర్టులో కేసు, గత తహసీల్దార్ లాక్ విషయాన్ని ప్రస్తుత తహసీల్దార్ యోగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించే నాటికే భూమి నారాయణమ్మ పేరుతో భూమి ఉందని, గారపాటి ప్రసాద్ ఇచ్చిన దరఖాస్తు మేరకు సత్తుపల్లిరూరల్ ఆర్ఐ నరేష్ విచారణ చేపట్టారని తెలిపారు. దరఖాస్తు ఇస్తే ఉన్నతాధికారులు పరిశీలించి భూమి బదలాయింపు జరగకుండా చర్యలు చేపడతారని చెప్పారు. ఇక మామిళ్లపల్లి కేశవరావు మాట్లాడుతూ కోర్టు వివాదం తేలేవరకు తన తల్లి రాధమ్మ పేరిటే ధరణి పహాణీ కొనసాగించాలని కోరారు.

సత్తుపల్లి డిపోలో సంబురాలు



సంబరాల్లో పాల్గొన్న డీఎం రాజ్యలక్ష్మి, ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలోనే ఉత్తమ డిపోగా ఎంపికై ప్రగతి చక్రం అవార్డు అందుకున్న సందర్భంగా సత్తుపల్లి డిపోలో మంగళవారం సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎం యు.రాజ్యలక్ష్మి ఆధ్వర్యాన ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. గత ఏడాది రెండో స్థానం నిలవగా, ఈసారి మొదటి స్థానానికి చేరడంతో పాటు హెర్‌బస్ డ్రైవర్లు ఇద్దరు కిషోర్, రామకృష్ణ ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారని డీఎం తెలిపారు. సమష్టి కృషితోనే ఈ విజయం దక్కిందని చెప్పారు. అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, మెకానికల్ ఇంజనీర్ ఎస్.సాహితి, ఆఫీస్ సూపరింటెండెంట్ రాములు, డిపో సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.